సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 25 । మే । 2023



గోపాలపురం టీడీపీలో అసమ్మతి

గోపాలపురం టీడీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు వ్యవహార శైలిపై ఆ పార్టీ నాయకులు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. 8లో



విహారానికి వచ్చి.. మృత్యుఒడికి

రాజమహేంద్రవరానికి చెందిన మహిళతో మరికొందరితో మారేడుమిల్లికి విహారానికి వెళ్లగా ప్రమాదవశాత్తూ చెట్టుకొమ్మ పడడంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. 8లో



అంతర పంటలపై ఆసక్తి

రైతులు కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఏలూరు జిల్లాలో 22 వేల హెక్టార్లలో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

28 నుంచి ఆన్‌లైన్ చెస్ పోటీలు



మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నూలి సాయి అభయ్ ఆన్‌లైన్ ఓపెన్ చదరంగం పోటీలు మే 28 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆన్‌లైన్ చదరంగం పోటీల్లో సుమారు 17 దేశాల నుంచి 1200 మంది క్రీడాకారులు రిజిస్టర్ అయ్యారని నిర్వాహకుడు అకాడమీ చైర్మన్ సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, అధ్యక్షుడు నూలి శ్రీనివాస్, సెక్రటరీ ఎస్.చంద్రశేఖర్‌లు తెలిపారు. 8 మంది గ్రాండ్ మాస్టర్లు, 16 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు పాల్గొంటారని వెల్లడించారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు రూ.50 వేలు విలువైన నగదు బహుమతులు ఉంటాయని వెల్లడించారు. ఇటీవల జరిగిన వేసవి చదరంగం పోటీలలో విజేతలకు మంత్రి కొట్టు సత్యనారాయణ, యువ నేత కొట్టు విశాల్ చేతుల మీదుగా మెడల్స్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలి



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం : పర్యావరణ హిత సమాజంలో ప్రజలు భాస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రం వద్ద పర్యావరణ హిత జీవనశైలి, మేరీ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లు వినియోగం మానేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం మంచిదికాదన్నారు. ప్రజలు ఈ విషయంలో అవగాహన పెంచుకోవాలన్నారు. సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. దీనివల్ల ఆరోగ్యం, వాహనాల కారణంగా పర్యావణానికి కలిగే నష్టం నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లిఖార్జునరావు, తహసీల్దార్ ఎండీ ఫాజిల్, ఎంపీడీవోలు ఎం.శివప్రసాద్‌యాదవ్, ఆర్‌సీ ఆనంద్ కుమార్, సీహెచ్ త్రిశూలపాణి పాల్గొన్నారు.

డీఐపీఆర్వోకు సన్మానం



డీఐపీఆర్వో నాగార్జునను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : సమాచార శాఖ డీఐపీఆర్వో దాసరి నాగార్జున డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై కాకినాడకు వెళ్తున్న సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయ సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బుధవారం సమాచార శాఖ డీఐపీఆర్వో కార్యాలయంలో ఈ సన్మానం జరిగింది. నాగార్జున ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఐపీఆర్‌ఓ కార్యాలయంలో 2019 జూలై నుంచి సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్నారు.

జగనన్న ఆణిముత్యాల సత్కారం వాయిదా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో చదువుతూ 10వ తరగతిలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచి విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం సత్కార కార్యక్రమాలు ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించగా.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమాలు వాయిదా పడ్డాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థనను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన ప్రతిపాదిత కార్యక్రమాలను జూన్ 12వ తేదీ తరువాత నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

పల్లెల్లో ప్రగతి భవనాలు

- సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ ద్వారా సేవలు
- స్థానికంగానే ప్రజలకు అన్ని సేవలు
- భవనాల కోసం రూ.455.56 కోట్ల ఖర్చు



యలమంచిలి మండలం మేడపాడులో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



భీమవరం మండలం శ్రీరామపురంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

భీమవరం(ప్రకాశం చౌక్) : గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశారు. ప్రజలకు స్థానికంగానే అన్ని వసతులు ఉండాలని నాడు గాంధీజీ భావించేవారు. ఆయన ఆశయాలను నేరవేరుస్తూ నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలోనే పరిపాలనతో పాటు సంక్షేమం అందిస్తూ అవసరమైన భవనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. పరిపాలన, సంక్షేమం కోసం గ్రామ సచివాలయం, రైతులకు సేవలు అందించడానికి రైతు భరోసా కేంద్రం, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి హెల్త్ క్లినిక్, ప్రజలకు మనో వికాసం, విజ్ఞానం అందించడానికి డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్లి సేవలు పొందే పని లేకుండా వారికి అన్ని రకాల సేవలను అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. ప్రభుత్వం పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో పల్లెలు ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయి.

గ్రామంలోనే అన్ని సేవలు

ఆయా గ్రామాల్లోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ప్రజలు చక్కగా ఉపయోగించుకుంటున్నారు. సంక్షేమ పథకాలు, ఇతర సేవలు పొందడానికి సచివాలయానికి వెళ్తున్నారు. విత్తనాలు తెచ్చుకుని తిరిగి పంట అమ్ముకునేందుకు రైతు భరోసా కేంద్రాల్ని ఉపయోగించుకుంటున్నారు.

జిల్లాలో భవనాలు వివరాలు

- రైతుభరోసా కేంద్రాలు : 363 (బడ్జెట్ రూ.139.15 కోట్లు) పూర్తయినవి–173
- గ్రామ సచివాలయ భవనాలు : 366 (బడ్జెట్ రూ.79.86 కోట్లు)– పూర్తి చేసిన భవనాలు 242
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు: 276 (బడ్జెట్ రూ.46.90 కోట్లు)– పూర్తి చేసినవి 91
- బల్క్ మిల్క్ యూనిట్లు : 10 (బడ్జెట్ రూ.175 కోట్లు)
- డిజిటల్ లైబ్రరీలు : 92 (బడ్జెట్ రూ.14.65 కోట్లు)



వీరవాసరం మండలం నవుడూరులో కొత్త సచివాలయ భవనం

గ్రామంలో విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్య సేవలు పొందుతున్నారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ప్రతి ఊరికి కొత్త భవనాలు రావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పరుచుకున్న లక్ష్యం నేరవేరి మంచి ఫలితాలు వస్తున్నాయి.

రూ 455.56 కోట్లతో భవనాల నిర్మాణం

గ్రామాల్లో నిర్మించిన భవనాల్లో గ్రామ సచివాలయం భవనానికి 3 రకాల గ్రాంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తుంది. టైపు 1 కింద రూ 40 లక్షలు(పూర్తి భవనం నిర్మాణం) టైపు 2కి రూ 25 లక్షలు (ఉన్న భవనంపై అదనపు ఫ్లోర్ వేయడానికి), టైపు 3కి రూ.35 లక్షలు(ఉన్న భవనానికి అనుకుని భవనం నిర్మాణానికి) ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ.17.5 లక్షలు, డిజిటల్ లైబ్రరీకి రూ 17.58 లక్షలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌కు రూ 15 లక్షలు నిధులు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా మొత్తం ఆయా గ్రామాల్లో ఈ 5 రకాల భవనాలకు కోసం సుమారు రూ.455.56 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. 90 శాతం మేర భవనాల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. మరో రెండు మూడు నెలల్లో నూరు శాతం భవనాలు వినియోగంలోకి వస్తాయి.

ఎంతో ఉపయోగకరం



మా గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. రైతు భరోసా కేంద్రం ద్వారా అన్ని రకాల వ్యవసాయ సేవలు పొందుతున్నాం. విత్తనాలు, ఎరువులు అందించడం దగ్గర నుంచి పంట కొనుగోలు వరకూ.. రైతు భరోసా వంటి పథకాలు కూడా పొందుతున్నాం.

– బి.రాంబాబు, రైతు, కొండేపూడి

వైద్య సేవలు పొందుతున్నాం



మా గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన విలేజ్ క్లినిక్ ద్వారా స్థానికంగానే వైద్య సేవలు అందుతున్నాయి. విలేజ్ క్లినిక్ భవనంలోకి వైద్యులు వచ్చి గ్రామంలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్యం అందిస్తున్నారు.

– కె.శాంత, శ్రీరామపురం, భీమవరం మండలం

కొత్త సచివాలయంలో అన్ని సేవలు



మా గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉండేది. ప్రభుత్వం నూతన సచివాలయం భవనం నిర్మించింది. ఇప్పుడు కొత్త భవనం నుంచి సేవలు అందుతున్నాయి. మా గ్రామంలోనే అన్ని సేవలు అందడం సంతోషంగా ఉంది.

– సీహెచ్.ఏడుకొండలు, నవుడూరు

పేద విద్యార్థులకు బాసట

జగనన్న విద్యా దీవెన చెక్కు పంపిణీ



భీమవరంలో జగనన్న విద్యా దీవెన చెక్కును విద్యార్థులకు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం : ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం చేపట్టిన జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థులకు ఎంతో బాసటగా నిలుస్తుందని దీనిని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నమూన చెక్కును అందచేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థుల కాలేజీ ఫీజుల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా చెల్లిస్తున్నట్లు వివరించారు. ఒకే కుటుంబంలో విద్యనభ్యసించే పిల్లలందరికీ ఈ పథకం వర్తిస్తుందని లబ్ధిదారుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. జిల్లాలోని 28,201 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను 25,194 మంది తల్లులు ఖాతాల్లో రూ.25.86 కోట్లు జమచేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భీమవరం నియోజకవర్గంలో 4,529 మందికి రూ.4.33 కోట్లు, ఆచంటలో 3,844 మందికి రూ.3.24 కోట్లు, నరసాపురంలో 3,427 మందికి రూ.2.92 కోట్లు, పాలకొల్లులో 3,179 మందికి రూ.2.81 కోట్లు, తాడేపల్లిగూడెంలో 4,196 మందికి రూ.4.15 కోట్లు, తణుకులో 4,871 మందికి రూ.4.63 కోట్లు, ఉండి నియోజకవర్గంలో 4,155 మందికి రూ.3.75 కోట్ల నగదును బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిణి కె.శోభారాణి, జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారిణి డి.పుష్పరాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ వంక



కొవ్వూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం కొవ్వూరులో జరిగిన జగనన్న విద్యా దీవెన పంపిణీకి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రిని కలసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, భీమవరం: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆర్ఐవో చంద్రశేఖర్‌బాబు చెప్పారు. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా మొదటి సంవత్సరంలో జనరల్ కేటగిరిలో 4,560 మందికి 4,201 మంది, ఒకేషనల్‌లో 443 మందికి 351 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జనరల్ కేటగిరీలో 543 మందికి 455 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 218 మందికి 187 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

ప్రశాంతంగా ఐసెట్

బుధవారం నిర్వహించిన ఐసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. డీఎన్నార్ కాలేజీ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, విష్ణు ఇంజినీరింగ్, విష్ణు ఉమెన్స్ కాలేజీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఉమెన్ డ్రాప్ ఎట్ హోంకు స్పందన

తెల్లవారుజామున కంట్రోల్‌రూంకు ఫోన్



ఏలూరు రైల్వేస్టేషన్ వద్ద తెల్లవారుజామున మహిళ వద్దకు చేరిన ఉమెన్ డ్రాప్ ఎట్‌హోం సిబ్బంది

ఏలూరు టౌన్: జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అమల్లోకి తెచ్చిన ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ సత్ఫలితాలిస్తోంది. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాల నుంచి ఏలూరు నగరానికి చేరుకుని సరైన ప్రయాణ సౌకర్యాలు ఇబ్బంది పడకుండా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ ఈ సేవలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. మహిళలు పోలీస్ కంట్రోల్‌రూమ్ 100 లేదా 112కు కాల్ చేయాలని కోరారు. ఏలూరు పోలీస్ కంట్రోల్‌రూంకు బుధవారం తెల్లవారుజామున 3.35 గంటలకు మావూరి విజయ ఫోన్ చేసింది. ఊరు వెళ్ళి వచ్చానని.. రైలు దిగి స్టేషన్ వద్ద ఒంటరిగా ఉన్నానని, ఇంటికి వెళ్ళేందుకు ప్రయాణ సౌకర్యాలు లేవని తెలిపింది. వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ క్రాంతిప్రియ ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది తెల్లవారుజామున 3.54 గంటలకు వాహనంలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మహిళను వాహనంలో ద్వారకానగర్ 2వ రోడ్డులోని ఆమె ఇంటివద్దకు సురక్షితంగా దింపారు.

రీ సర్వే పనులు వివాదరహితంగా సాగాలి

కలెక్టర్ ప్రశాంతి



రీసర్వే వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

నరసాపురం: దాదాపు వందేళ్ల తరువాత జరుగుతున్న భూముల రీసర్వే పనులు వివాదాలకు తావు లేకుండా, రైతులు భూయజమానులు మెచ్చేలా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రీసర్వేపై రెవిన్యూ అధికారులు, సర్వేయర్లతో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ రీసర్వే జరపాల్సిన తీరుపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేలో భాగస్వాములైనవారందరూ మనసు పెట్టి పనిచేసి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. మొదటి దశలో జిల్లాలో వివిధ మండలాల్లో 16 గ్రామాల్లో చేపట్టి విజయవంతంగా ముగించామని చెప్పారు. రెండో దశలో కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సర్వేలో భాగంగా ప్రతి రైతును, భూయజమానిని భూమి వద్దకు పిలిచి సర్వే రికార్డులు వారి సమక్షంలోనే పక్కాగా తయారు చేయాలని చెప్పారు.

డ్రోన్ల సాయంతో రీ సర్వే పనులు

ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా రీసర్వే పనుల్లో డ్రోన్లు వినియోగిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. సర్వే పనుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కచ్చితమైన సర్వే రావాలనే ఉద్దేశ్యంతోనే మరోసారి వర్క్‌షాప్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సర్వే కార్యక్రమం ప్రారంభమై పూర్తయ్యే వరకూ సీరియస్‌గా తీసుకోవాలని వివరించారు. సర్వేలో ప్రతీ అంశం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. సర్వేలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సకాలంలో రెండో దశ రీసర్వే పనులు పూర్తికావాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, జిల్లా సర్వే లాండ్ రికార్డు అధికారి కె.జాషువా, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నిండా ముంచిన నిమ్మ

- కిలో రూ.10కి పడిపోయిన ధర
- ఏలూరు జిల్లాలో 4,500 హెక్టార్లలో పంట



జంగారెడ్డిగూడెం వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నిమ్మ ధర పతనమవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. అకాల వర్షాలు నిమ్మ రైతుల్ని దెబ్బతీశాయి. గత కొద్ది రోజులుగా నిమ్మ కేజీ ధర రూ.10కి పడిపోయింది. నాణ్యత పరిమణాన్ని బట్టి అత్యధికంగా రూ.20కి మించి రావడంలేదు. ఒక దశలో కిలో రూ. 50 నుంచి రూ.70 వరకు రైతుకు లభించేది. అయితే ఒక్కసారిగా ధర పతనమైంది. ధర పడిపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి బాగానే ఉన్నా ధర మాత్రం లేదు. జిల్లాలో సుమారు 4,500 హెక్టార్లలో రైతులు నిమ్మ పంటను పండిస్తున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో ఈ పంట అధికంగా పండిస్తున్నారు. ఒక్క ద్వారకాతిరుమల మండలంలోనే 1250 హెక్టార్లలో నిమ్మ పండిస్తుండగా, దేవరపల్లి మండలంలో 603, పెదవేగిలో 321, జంగారెడ్డిగూడెంలో 374 హెక్టార్లలో నిమ్మ పండిస్తున్నారు. మిగిలిన మండలాల్లో సుమారు 2000 హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. జిల్లాలో పండిన నిమ్మ పంటను స్థానిక అవసరాలకు పోగా, మిగిలింది జంగారెడ్డిగూడెం, ఏలూరు, నల్లజర్ల, ద్వారకాతిరుమల, యాదవోలు, కామవరపుకోట, తాడేపల్లిగూడెం, గోపన్నపాలెం హోల్‌సేల్ మార్కెట్లకు రైతులు తరలిస్తారు. జిల్లాలో అతిపెద్ద మార్కెట్ ఏలూరులో ఉంది. ఇక్కడ సీజన్‌లో సుమారు 30 నుంచి 40 లారీల లోడులు ఎగుమతి అవుతుంటాయి. నల్లజర్ల, తాడేపల్లిగూడెం, గోపన్నపాలెం, జంగారెడ్డిగూడెం మార్కెట్ నుంచి 3 నుంచి 5 లోడ్‌లు ఎగుమతి అవుతుంటాయి. ఒకొక్క లారీలో 10 టన్నుల నిమ్మకాయలు రవాణా చేస్తుంటారు. ప్రధానంగా బిహార్, ఒడిశా, బెంగాల్, వారణాసి, ఢిల్లీ, హైదరాబాద్, రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు నిమ్మ ఎగుమతి అవుతుంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. మన జిల్లా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అక్కడ మార్కెట్ అంతంతమాత్రంగానే ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, దీంతో రైతుల నుంచి పంట కొనుగోలు చేయలేకపోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

మార్కెట్‌లో ధర లేదు



ప్రస్తుతం నిమ్మకు మార్కెట్ లేదు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దగా డిమాండ్ లేకపోవడంతో, అక్కడికి నిమ్మను తరలించినా ధర లభించడం లేదు. ఆ కారణంగా ఇక్కడి మార్కెట్ పతనమైంది. అక్కడ మార్కెట్ బాగుంటే ఇక్కడ బాగుంటుంది.

– ఈదా సత్యనారాయణ, నిమ్మ వ్యాపారి, జంగారెడ్డిగూడెం

సిండికేట్ అవుతున్న వ్యాపారులు



వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. మార్కెట్ బాగానే ఉంది. అయినా వ్యాపారులు సిండికేట్ అవుతుండటంతో నిమ్మకు రేటు రావడంలేదు. నిమ్మకాయల నాణ్యత బాగున్నా ధర లేదు. కేజీకి రూ.20 దాటకపోవడంతో నష్టాలు చూస్తున్నాం.

– కనపర్తి సత్యనారాయణ, నిమ్మ రైతు, కట్టవపాదలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం

రేపు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

విద్యుత్ ఈఈ బి.సురేష్ కుమార్

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల్ని పరిష్కరించేందుకు పరిష్కార వేదిక ఏర్పాటుచేయనున్నట్లు విద్యుత్ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 26న ఉల్లంపర్రు అల్లూరి సత్యనారాయణరాజు ఐటీఐ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుండి 11.30 గంటల వరకూ పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి అడవిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సమావేశాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పులు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు వంటి సమస్యలపై చర్చించవచ్చన్నారు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సాక్షి, భీమవరం: పట్టణంలోని చినఅమిరం పరిధిలోని భారత్ పెట్రోలియం బంకు వద్ద అక్రమంగా తమిళనాడు రాష్ట్రం చైన్నైకి చెందిన మద్యాన్ని స్కూటర్‌పై తరలిస్తున్న రమేష్ లోగయ్యను బుధవారం అరెస్టు చేసినట్లు భీమవరం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ చెప్పారు. రమేశ్ లోగయ్య నుంచి సుంకం చెల్లించని 44 టిన్నుల బీర్లు, సెల్ ఫోను, స్కూటరు స్వాధీనం చేసుకుని భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషనులో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారన్నారు. ఈ కేసులో రమేష్ లోగయ్యకు మద్యం సరఫరా చేసిన వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని వర్మ చెప్పారు.

బ్యాంకు క్యాషియర్ అదృశ్యంపై కలకలం

తణుకు: వేల్పూరుకు చెందిన బ్యాంకు ఉద్యోగి అదృశ్యం కలకలం రేపింది. గ్రామంలోని యూనియన్ బ్యాంకు వేల్పూరు శాఖలో రెండేళ్లుగా క్యాషియర్‌గా పని చేస్తున్న మిడతాడి అప్పలనాయుడు బుధవారం ఉదయం యధావిధిగా బ్యాంకుకు వచ్చారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లిన అప్పలనాయుడు సూసైడ్ నోట్ రాసి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో భార్య రేణుకాదేవి బ్యాంకు సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో అప్పలనాయుడు ఆచూకీ కోసం గాలించారు. చివరికి రాజమహేంద్రవరంలో బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన అప్పలనాయుడు క్షేమంగానే ఉన్నట్లు తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య చెప్పారు. కుటుంబంలో మనస్పర్థలే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు.

అంతర పంటలపై ఆసక్తి

- లాభసాటిగా అంతర పంటల సాగు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీగా రాయితీలు
- ఉమ్మడి జిల్లాలో 22 వేల హెక్టార్లలో సాగు



చింతలపూడి : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ఉద్యాన పంటలు పండించే రైతులకు అనేక రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచీ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. రైతులు వరి నుంచి ఇతర పంటల వైపు దృష్టి పెడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. అంతర పంటల సాగుతో ఒక పంటకు వచ్చిన నష్టం నుంచి మరో పంట సాగుచేసుకునే అవకాశంతో బయటపడొచ్చు. తద్వారా లాభాలు పొందవచ్చు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1.50 లక్షల హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలు విస్తరించి ఉండగా అత్యధిక భాగం 80 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్, 24 వేల హెక్టార్లలో కొబ్బరి పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 22 వేల హెక్టార్లలో అంతర పంటగా కోకోతోపాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు.

సాగు ఖర్చు, నీరు ఆదా

మెట్ట ప్రాంత రైతులు అంతర పంటల సాగుపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. కొబ్బరిలో కోకో, అరటి, ఆయిల్‌పామ్ తోటల్లో వేరుశనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న, ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో కూలీల కొరతను అధిగమించడమే కాకుండా ఎరువులు, పురుగుమందులు వాడినప్పుడు ఖర్చు తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే వీలు కలుగుతుందని రైతులు చెబుతున్నారు.



అరటి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న వేరుశనగ



అంతర పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)



ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా వేసిన మొక్కజొన్న

ఉద్యాన పంటలకు ప్రభుత్వ రాయితీలు ఇలా..

పంట	హెక్టారుకు (రూ.ల్లో)
పసుపు	12,000
మిరియాలు	8,000
డ్రాగన్ ఫ్రూట్	3,31,200
పైనాపిల్	26,250
జాజికాయ	15,000
స్ట్రాబెర్రీ	1,25,000
వెల్లుల్లి	12,000
లవంగాలు	15,000
దాల్చిన చెక్క	15,000

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అధిక ఆదాయం వచ్చే 10 రకాల అంతర పంటలను ఉద్యాన శాఖ ద్వారా రైతులకు పరిచయం చేస్తున్నాం. సరైన ప్రణాళిక, అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి రైతులు సాగు చేసుకోవచ్చు. ఒక పంట నష్టపోయినా రెండో పంట ద్వారా నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – అడపా దుర్గేష్, ఏడీ, ఉద్యాన శాఖ

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల బస్తాను తూకం వేయిస్తున్న ఏడీ గంగాధర్

కొయ్యలగూడెం : మండలంలోని పలు గ్రామాలలో ఎరువుల దుకాణాలను కైకలూరు ఏడీ గంగాధర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఏవో చెన్నకేశవులతో కలిసి కొయ్యలగూడెం, పొంగుటూరు, బయ్యన్నగూడెం, కన్నాపురంలోని పురుగుమందులు, ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డుల్లో ఇన్వాయిస్ వివరాలు లేకపోవడంతో రెండు షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంఆర్‌పీకే ఎరువులు, పురుగుమందులను విక్రయించాలన్నారు. పలు షాపుల వద్ద నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో ఎరువుల బస్తాల బరువును తూకం వేయించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

తణుకు: క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న ఇద్దరు ముఠాసభ్యులను అరెస్టు చేసినట్లు తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ చెప్పారు. స్థానిక ఆలమూరి వారి వీధిలో బ్యాంకు ఆఫ్ బరోడా ఎదురుగా కీర్తి టవర్స్‌లో ఫ్లాట్ నెంబర్ 205 అద్దెకు తీసుకున్న కె.సావరం గ్రామానికి చెందిన కలిదిండి సీతారామరాజు, తణుకు పట్టణానికి చెందిన వేంద్ర రవితేజ క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. వీరిద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.19,500 నగదు, ఒక లాప్‌టాప్, ఏడు సెల్‌ఫోన్లు, ఒక టీవీ, సెటప్‌బాక్స్, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

పరీక్ష రాయడానికి వచ్చి.. గర్భస్రావమై..

పెనమలూరు: ఏపీ ఈఏపీసెట్ పరీక్ష కేంద్రం వద్ద ఓ పసికందు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కృష్ణా జిల్లా పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కానూరులో అయాన్ డిజిటల్ కేంద్రంలో ఏపీఈఏపీసెట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ కేంద్రం వద్ద పసికందు మృతదేహం ఉందని సమాచారం అందింది. ఈ ఘటనపై విచారణ చేయగా దిగ్భ్రాంతి కలిగించే విషయం బయటపడింది. ఏలూరుకు చెందిన బాలిక (17) ఇంటర్ పూర్తి చేసి ఏపీ ఈఏపీసెట్ పరీక్ష రాయటానికి మంగళవారం కానూరు వచ్చింది. ఆమె గర్భంతో ఉండటంతో పురిటినొప్పి వచ్చి పరీక్ష కేంద్రం షెడ్డు వద్ద గర్భస్రావమై నెలలు నిండని మృత మగశిశువుకు జన్మించినట్లు పోలీసులు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పరీక్ష రాసిన బాలికను గుర్తించిన మహిళా ఎస్ఐ ఉషారాణి విచారణ చేయగా, బావతో ప్రేమ వ్యవహారం వల్ల గర్భం దాల్చానని బాలిక చెప్పింది. పోలీసులు బాలికను వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్స కోసం చేర్చారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఏలూరుకు బదిలీ చేశారు. పోలీసులు ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



వివాహిత ఆత్మహత్యపై విచారణ నిర్వహిస్తున్న ఎస్ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్. చంటిబాబు బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కనసానపల్లికి చెందిన జగన్నాథం సుబ్బయ్యతో కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లికి చెందిన లక్ష్మీతిరుపతమ్మతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ నెల 23న రాత్రి సమయంలో భోజనం పెట్టమని సుబ్బయ్య భార్యను అడగగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తల్లి చిట్టిపోతుల చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: యువతి అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఎస్సై ఎం.కుటుంబరావు చెప్పారు. వివరాల్లోకి వెళితే మండలంలోని చెక్కపల్లికి చెందిన 19 ఏళ్ల యువతి సోమవారం రాత్రి ఇంటి వద్ద నుంచి అదృశ్యమైంది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెదకినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన పందేటి నాగరాజు కుమారుడు తిరుపతిరావు తమ కుమార్తెను తీసుకెళ్లి ఉండవచ్చని ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలైన భార్యపై బ్లేడ్‌తో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గమ్మ

టి.నరసాపురం: భార్యను బ్లేడ్‌తో గాయపర్చిన భర్తపై కేసు నమోదు చేసి ఎస్సై కె.సతీష్‌కుమార్ చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. బొర్రంపాలెంలో చింతా దుర్గమ్మ (72)పై అనుమానంతో 75 ఏళ్ల ఆమె భర్త దుర్గయ్య మంగళవారం రాత్రి షేవింగ్ బ్లేడ్‌తో భార్య నిద్రిస్తుండగా మెడపై గాయపర్చాడు. దుర్గమ్మను ఆమె కుమార్తె మాధవి అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించింది. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: ఒక బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన ఘటనలో ఒక యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు బుధవారం చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఒక బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి పట్టణానికే చెందిన యువకుడు షేక్ జానీ ఈ నెల 22న బాలికను కిడ్నాప్ చేశాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, యువకుడు జానీని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బకు గురై వ్యక్తి మృతి?

తణుకు: పట్టణంలోని పాతవూరుకు చెందిన ఓ వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఎన్టీఆర్ కాలనీ ఎదురుగా నివాసం ఉంటున్న ముప్పిడి వెంకటేశ్వరరావు (62) బుధవారం సేద తీరేందుకు పార్కు సమీపంలో సిమెంటు బల్లపై కూర్చున్నారు. కొద్దిసేపటికే మృతి చెందడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదని పట్టణ పోలీసులు వెల్లడించారు.

గోపాలపురం టీడీపీలో అసమ్మతి గళం



కప్పలకుంటలో సమావేశమైన నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు

ద్వారకాతిరుమల: గోపాలపురం నియోజకవర్గ టీడీపీలో అసమ్మతి గళం వినిపిస్తున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు వ్యవహార శైలి, ఒంటెద్దు పోకడను వ్యతిరేకిస్తూ మండలంలోని గుణ్ణంపల్లి పంచాయతీ, కప్పలకుంటలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంకురాత్రి శ్రీను, ఆయన సోదరుడు సంకురాత్రి రాంబాబు ఇంటి సమీపంలోని తోటలో మంగళవారం రాత్రి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మద్దిపాటి వెంకట్రాజు తీరుపై ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో కొంత మంది బడా నాయకుల్ని వెంట బెట్టుకుని రాజకీయం చేస్తున్నారని, గ్రామాల్లో యువకులకు పెత్తనమిచ్చి, నాయకులను అసమర్థులను చేశారని, కులచిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరి కార్యాలయంలో 200 మంది నాయకులు, కార్యకర్తలు మద్దిపాటి నాయకత్వాన్ని వ్యతిరేకించినా అర్ధరాత్రి 12 గంటలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అతనినే ఇన్‌చార్జిగా ప్రకటించడం దారుణమన్నారు. నాయకులందరూ నిర్ణయించాల్సిన మండల అధ్యక్ష పదవిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారని, ఇది టీడీపీ సంప్రదాయం కాదన్నారు. డబ్బు తగలేసుకుని పార్టీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈనెల 27న రాజమండ్రిలో జరిగే మహానాడు తరువాత మళ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఇన్‌చార్జి విషయంలో తుది నిర్ణయం తీసుకుందామని నిర్ణయించారు. నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని, ఇన్చార్జి నియామకం విషయంలో నాయకులందరికీ అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటినీ అధిష్టానానికి తెలిపి పార్టీ పరిగణలోకి తీసుకుంటే కష్టపడి పనిచేయాలని, లేకుంటే ఆరోజే తగు నిర్ణయం తీసుకుందామని నిర్ణయించారు.

బాధితురాలికి 'మహిళా కమిషన్' పరామర్శ



బాధితురాలి నుంచి వినతిపత్రం తీసుకుంటున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు వినీత

ఇరగవరం: రాపాకలో వలంటీర్‌పై అత్యాచారయత్నం ఘటనలో బాధితురాలిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత బుధవారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వినీత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల సంరక్షణ కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా దిశ చట్టం తీసుకువచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. అయినప్పటికి ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం అన్నారు. నిందితుడు విల్సన్ బాబును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేస్తామని ధైర్యం చెప్పారు. బాధితురాలి కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.

వరుసకు చిన్నాన్నే నిందితుడు

బాధితురాలి తల్లి దూర దేశంలో ఉపాధి నిమిత్తం వెళ్లగా, తండ్రి వ్యవసాయం చేస్తుంటాడు. యువతి గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తోంది. సోదరుడు చదువుకుంటున్నాడు. ఈ నెల 21న యువతి ఇంట్లో వంట చేస్తుండగా అదే గ్రామానికి చెందిన నిందితుడు పులపర్తి విల్సన్‌బాబు ఇంట్లోకి ప్రవేశించి ఆమె నోరు నొక్కి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అతని నుంచి తప్పించుకుని బయటకు వచ్చి బాధితురాలు కేకలు వేయగా, విల్సన్‌బాబు పరారయ్యాడు. జరిగిన విషయం తండ్రికి చెప్పగా, అతని సహాయంతో ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

విహారానికి వచ్చి.. మృత్యు ఒడికి



సంధ్య మృతదేహం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రకృతి ఒడిలో సరదాగా సేదా తీరుదామని వచ్చిన ఓ పర్యాటకురాలును చెట్టుకొమ్మ రూపంలో మృత్యువు కబళించింది. బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు విహార యాత్రకు మారేడుమిల్లి బయలుదేరారు. మార్గంలో రాజమహేంద్రవరంలో మరొక మహిళతో కలిసి ఎనిమిది మంది బుధవారం మారేడుమిల్లి వచ్చారు. ఇక్కడ నుంచి జలతరంగిణి జలపాతం వద్దకు వెళ్లారు. సందర్శన అనంతరం అక్కడి నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. వీరిలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.సంధ్య (38) జలపాతం పైభాగంలో బండరాళ్లపై కూర్చొని ఉంది. ఆమెపై ఒక్కసారిగా భారీ చెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో ఆమె కిందకు జారి బండరాళ్లపై పడిపోయింది. తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం చేసిన ఇద్దరు వ్యాపారులపై కేసు

ఆగిరిపల్లి: చీటింగ్ కేసులో ఇద్దరు వ్యాపారులపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంటిబాబు బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఈదరకు చెందిన ఇంతేటి గోపికృష్ణ, లంకపల్లి రాంబాబు, లంకపల్లి చిన్న వెంకటేశ్వరరావు, లంకపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తులు అదే గ్రామానికి చెందిన కర్ర వ్యాపారం చేస్తున్న లంకపల్లి కోటేశ్వరరావు, లంకపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తుల వద్ద గుమస్తాలుగా 2017 నుంచి పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని నమ్మబలికి నలుగురు వ్యక్తుల పేరు మీద బ్యాంక్ అకౌంట్‌లు తెరిపించి, చెక్కులపై సంతకాలు చేయించుకున్నారు. కొంతకాలం జీతం బాగానే ఇచ్చినా ఇటీవల ఎనిమిది నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో నలుగురు జీతం ఇవ్వాలని అడిగారు. దీనిపై తమకే మీ నలుగురు రూ.5 లక్షలు ఇవ్వాలని, లేకపోతే చెక్కులపై కోర్టు దావా వేస్తామని బెదిరించారు. ఇద్దరు వ్యక్తులు తమను మోసగించి తమకు తెలియకుండా తమ బ్యాంకు ఖాతాలను లక్షల్లో లావాదేవీలు జరిపిన విషయాలపై ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకుకు టోకరా.. సీబీఐ ఆరా!

సాక్షి, భీమవరం: నకిలీ పత్రాలు, సంబంధంలేని భూములను హామీగా చూపి బ్యాంకులో పెద్ద మొత్తంలో రుణం తీసుకున్న వ్యవహారంలో భీమవరంలో సీబీఐ అధికారులు విచారణ చేస్తున్నారంటూ బుధవారం పట్టణంలో జోరుగా ప్రచారం సాగింది. దీనికి సంబంధించి స్థానిక అధికారుల వద్ద ఎటువంటి సమాచారం లేకున్నా బ్యాంకు వద్ద అధికారులు బ్యాంకును మోసం చేసిన ఘరానా మోసగాళ్ల వ్యవహారంపై ఆరా తీసినట్లు చెబుతున్నారు. జిల్లాకు చెందిన కొంతమంది బడాబాబులు నకిలీపత్రాలతో కృష్ణా జిల్లాలోని బ్యాంకు నుంచి కోట్లాది రూపాయలు రుణం తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు భూములు గల రైతులకు నోటీసులిచ్చారు. దీంతో కంగారుపడ్డ రైతులు బ్యాంకుకు వెళ్లగా దాదాపు రూ.10 కోట్ల వరకు నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్నారని, వీరిలో పట్టణానికి చెందిన కొంతమంది పెద్దలు ఉన్నారని తెలిసింది. దీనిపై సీబీఐ అధికారులు బుధవారం భీమవరంలో మరిన్ని వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

బీజేపీ పటిష్టానికి కృషి చేయాలి

తణుకు టౌన్: బూత్ స్థాయి నుంచి బీజేపీ పటిష్టానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డీ ఉమామహేశ్వరరాజు కోరారు. బుధవారం తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన జిల్లా బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉన్నమట్ల కపర్ది, కె రవికుమార్, పీ సుబాష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: పెంటపాడు మండలం చింతపల్లి శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై బుధవారం పెంటపాడు పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై సత్యనారాయణ వెల్లడించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.11,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

29 నుంచి సర్టిఫికెట్స్ పరిశీలన

పెంటపాడు: తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ (నిట్ ఈస్ట్ గేట్) పోలిసెట్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధానాచార్యులు డి.ఫణీంద్ర ప్రసాద్ తెలిపారు. పోలిసెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ర్యాంకులు వారీగా కౌన్సిలింగ్‌కు రావాలన్నారు. ఈ నెల 25 నుంచి కౌన్సిలింగ్ ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ 250 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించి ఫీజు రశీదు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు జతల జిరాక్స్ కాపీలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చునని, 9వ తేదీన సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దిగువ ఫొన్ నెంబర్లను 9010222178, 8919368653, 9490104336 సంప్రదించాలని కోరారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

సాక్షి, భీమవరం: ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. భీమవరం పట్టణం మెంటేవారితోటలో పాస్టర్ నేతల జ్ఞాన ప్రకాష్ ఏర్పాటు చేసిన క్రైస్తవ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవునిపై భక్తి,శ్రద్ధలు కలిగి ఉంటే దేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాస్టర్ యు.రమేష్, నేతల సాల్మన్‌రాజు, మాలమహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో అన్నసమారాధన

ఉండి: హనుమద్ జయంతి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఉండి సెంటర్‌లో ఉన్న పంచముఖ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉండి, కలిసిపూడి, చెరుకువాడ, పాములపర్రు, ఎన్నార్పీ అగ్రహారం, వాండ్రం ,మహదేవపట్నం, వెలివర్రు, చిలుకూరు తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయానికి వచ్చే స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించే భక్తుల కోసం కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

సాక్షి, భీమవరం: భీమవరం వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, డ్రాయింగ్, యోగ, నృత్యం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. అలాగే సోదరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సౌత్‌మల్లీపుల్ సభ్యుడు కె.భవానీసీతల్ మాట్లాడుతూ ప్రపంచమే ఒక పెద్ద కుటుంబమని బాల్యం నుంచి సోదర ప్రేమ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వర రావు, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, డి.రామనాగేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆగని చెరువుల తవ్వకం పనులు

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా కొత్త చెరువుల తవ్వకం యథేచ్ఛగా కొనసాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కుప్పనపూడి గ్రామంలో ఇటీవల ఆర్డీఓ దాసి రాజు అనుమతి లేని చెరువు తవ్వకంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన విషయం విధితమే. అదే చెరువులో బుధవారం ట్రాక్టర్లతో బ్లేడ్ పనులు కొసాగిస్తున్నారని సరిహద్దు రైతు మోటుపల్లి రాజు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ హెచ్చరించినప్పటికీ మండల రెవెన్యూ అధికారులు చెరువు తవ్వకం పనుల్ని నిలుపుదల చేయడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

సంక్షేమ ఆశయ సారథులు వలంటీర్లు

తాడేపల్లిగూడెంలో వలంటీర్లకు వందనం

తాడేపల్లిగూడెం అర్బన్ : సంక్షేమ పథకాలను పేదల వద్దకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు అన్నారు. పట్టణంలోని 5, 6,7, 8, 9 వార్డుల వలంటీర్లకు సేవారత్న అవార్డులను అందచేశారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నందు వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. విప్లవాత్మకమైన వలంటీర్ల వ్యవస్థపై దేశంలో అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రజలకు కుటుంబ సభ్యులకు సేవాతత్పరులుగా వలంటీర్లు నిలిచారన్నారు. తమ చేతుల మీదుగా అవార్డులను అందచేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ మురళీకృష్ణ, నాయకులు బూడి ప్రసాద్, శానం రామకృష్ణ, మద్దుల ప్రసాద్, కోడే శ్రీను, బత్తిన గణేష్ , ఆయా వార్డుల సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న వార్డు ఇన్‌ఛార్జి కర్రి భాస్కరరావు, మున్సిపల్ అధికారులు



తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం సచివాలయంలో వలంటీర్లను సన్మానించిన దృశ్యం

కరోనా సమయంలో వలంటీర్ల సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం రూరల్: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వీరంపాలెం, పట్టింపాలెం, కొమ్ముగూడెం గ్రామ సచివాలయాల వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్ముగూడెం సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా వలంటీర్లు సేవలందించాలన్నారు. తద్వారా వారి సేవలకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కేతిరెడ్డి మాధవి, తాడేపల్లి బేబి, ఎమ్పీటీసీలు జంపెల్లి సత్యవతి, నోడల్ అధికారి ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.ఫణికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సబ్‌ట్రెజరీ పరిధిలో ఈకేవైసీ పూర్తికాని పెన్షనర్లు వీలైనంత త్వరగా ఎస్టీఓ కార్యాలయంలో పూర్తి చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ తెలిపారు. పట్టణంలో పెన్షనర్స్ కార్యాలయంలో బుధవారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. హరికుమార్ మాట్లాడుతూ ఈకేవైసీ చేయాలనే అంశం చాలా మంది పెన్షనర్లుకు తెలియడం లేదన్నారు. ఆలస్యం అవుతున్నందున ఈకేవైసీ తప్పక చేయించాలని కోరారు. పెన్షనర్లు అందరూ ఫారం 16ను అందించా లని తెలిపారు. పెన్షనర్లుకు సంబంధించి రావాల్సిన బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



వేల్పూరు గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న దృశ్యం



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదివించడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ యోగాపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారుచేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతికథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు, వేమన పద్యాలు, జనరల్ నాలెడ్జ్‌పై ఉపాధ్యాయిని కె కోమలి శిక్షణ ఇచ్చారు. అనంతరం జ్యోతిలలిత చిన్నారులకు రైమ్స్, పాటలు నేర్పించారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, పుస్తక పఠనంతోనే సాధ్యమని రిటైర్డు టీచర్ కె చెన్నకేశవరావు చెప్పారు. విద్యార్థులు వేసవిలో కాలయాపన చేయకుండా సమయాన్ని గ్రంథాలయంలో సద్వినియోగం చేసుకుని పుస్తక విజ్ఞానం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వి గణపతి, పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ అలవెన్స్‌లు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు సమ్మర్ అలవెన్స్‌లు చెల్లించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో ఉపాధి పని ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ మస్టర్ విధానంతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి హామీ పథకం కూలీలు వాపోతున్నారన్నారు. గుణపాల సానకు ఇచ్చే సొమ్ములు ఇవ్వాలని, మంచినీరు, రవాణా ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంకిపాటి వీరా స్వామి, కాకర్లమూడి వెంకట్రావు, పాముల ఏసుపాదం, గెద్దం రామచంద్రరావు, నూతంగి ఏసురత్నం, బత్తిన శ్రీను, యర్రా రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాలు ఆవరణలో ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25 గురువారం నుంచి జూన్ 21 వరకు మహిళలకు ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. యోగా ఆసనాలు ఎంతో ఉపయుక్తమని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం యోగా గురువు బడుగు చంద్రశేఖర్ పర్యవేక్షణలో శిక్షణను విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా రవాణాపై అవగాహన అవసరం



మేరి లైఫ్ కార్యక్రమంలో సైకిల్‌పై మండల పరిషత్ కార్యాలనికి వచ్చిన ఎంపీడీవో టీఎస్ మూర్తి

తణుకు టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో మేరి లైఫ్ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో బాగంగా బుధవారం పంచాయతీ రాజ్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది సైకిల్‌పై విధులను నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బుధవారం ప్రజా రవాణాపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో చిన్న లేదా దగ్గరి ప్రయాణాలకు సైకిల్‌ను ఉపయోగించడం, ఈ కార్యక్రమాల్లో గ్రామ వలంటీర్లను బాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా తణుకు ఎంపీడీవో టీఎస్ మూర్తి సైకిల్‌పైనే మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సైకిల్‌పైనే తన విధులకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.

జూన్ 1 నుంచి పశు బీమా పథకం అమలు

భీమవరం అర్బన్: జూన్ 1 నుంచి వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా పశు పెంపకం దారులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం చేపడుతుందని మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు గురువారం తెలిపారు. ఇప్పటికే పశు పెంపకందారులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు, లీటర్ ధర పెంపు, సబ్సిడీపై మినీ గోకుల్ షెడ్లు ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు.

నేడు జగనన్న కాలనీకి శంకుస్థాపన

సాక్షి, భీమవరం: పట్టణంలోని విస్సాకోడేరు జగనన్న కాలనీ లేఔట్‌లో రూ.3.69 కోట్లు వ్యయంతో నిర్మించే గ్రావెల్ రోడ్డుకు ఈ నెల 25న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య చెప్పారు. గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని భోగయ్య పిలుపునిచ్చారు.

రంగస్థల కళాకారుల సంఘం సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 43 సంవత్సరాలుగా కళాసేవ, 132 నెలలుగా పేద కళాకారులకు ఆర్థిక సత్కారం, కళా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని గీతా మందిరంలో బుధవారం రాత్రి సంఘ 132వ నెలవారీ సభా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ఏలూరి జగదీష్ అధ్యక్షత వహించారు. బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేశవభట్ల విజయ్‌కు గౌరవ సత్కారం, బాల్ పెన్ను చిత్రకారుడు షేక్ హజరత్ వలీకి ఉద్యోగ పురస్కారం అందజేశారు. కళాకారుడు కోపల్లె శ్రీనివాస్‌కు ఏకపాత్రాభినయ కళా బ్రహ్మ బిరుదుతో సత్కారం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నటి బోయిన గంగాజలంవాణి (జంగారెడ్డిగూడెం)నకు ఆర్థిక సత్కారం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు, సంఘ సభ్యులు సూరంపూడి వెంకటరమణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, కె.వెంకటాచలం,ఎ.జనార్దన్, చింతకాయల వంశీ, టి.మురళీకృష్ణ, శివకుమార్, శరత్, శారద, పోతురాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.



ఏకపాత్రాభినయంలో కోపల్లె శ్రీనివాస్ దృశ్యం

ప్రజా సమస్యలను ముందే గుర్తించాలి

ఉండి: మండలంలో ప్రజలుపడుతున్న ఇబ్బందులు,సమస్యలు ఏవైనా ఉంటే వారు ఫిర్యాదు చేసే వరకూ ఎదురుచూడకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోను ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ఆరా తీయాలన్నారు. వాటి పరిష్కారానికి సచివాలయానికి సమాచారం అందించి సంబంధిత అధికారికి వివరాలు అందించాలన్నారు. సాధ్యమైనంత త్వరగానే సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఇరిగేషన్, డ్రెయిన్ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. వాటిపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, వైస్ ఎంపీపీలు కనకదుర్గ, సుజాతరాణి, ఎంపీడీఓ ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. మానసిక వికాసం

- గూడెంలో ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- పుస్తక పఠనంపై శిక్షణ



తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం, గ్రంథాలయాన్ని సందర్శించడంతో బాల బాలికలలో పుస్తక పఠనాసక్తి పెంచేందుకు ఏపీ పౌర గ్రంథాలయ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో మే 8 నుంచి జూన్ 11 వరకు 35 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలను గ్రంథాలయాలకు అలవాటు చేసే క్రమంలో వారికి జ్ఞానం, విజ్ఞానం, సృజనత్మకత, మానసిక వికాసం, పెద్దలను గౌరవించడం, నడవడిక, సంప్రదాయలు, సామాజిక అంశాలు, వివిధ నైపుణ్యాలతో పాటు ఆట పాటలు కోసం ఈ శిబిరాలు జరుగుతున్నాయి. స్వచ్ఛంద కార్యకర్తలను, విశ్రాంత ఉద్యోగులను ఆహ్వానించడం ద్వారా విద్యార్థులకు ఎంతో విలువైన సమాచారన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. నియోజకవర్గంలో తాడేపల్లిగూడెంతో పాటు పెంటపాడులో సైతం గ్రంథాలయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు.


బాల బాలికలను ఆకట్టుకున్న శిక్షణ తరగతులు

ఈ శిక్షణ తరగతులు విద్యార్థులను ఎంతోగానో అకట్టుకున్నాయి. శిక్షణలో భాగంగా ఉదయం 8గంటలనుంచి 12 గంటల వరకు నైపుణ్యాలు పెంచేందుకు కథలు, పుస్తక పఠనం, పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్, పర్యవరణం పరిరక్షణ, తెలుగు, హిందీ, గణితం , సైన్సు, సోషల్, ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషు, దేశభక్తి గేయాలు, డాన్స్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, యోగా తదితర అంశాల్లో శిక్షణను అందిస్తున్నారు. పలు అంశాలను విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

విద్యార్థులకు నేర్పేందుకు విశ్రాంత ఉద్యోగులు, పీజీ స్టూడెంట్స్:


గ్రంథాలయాల అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు విశ్రాంత ఉద్యోగులు ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్ రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు, గరికిపాటి బాపయ్య శర్మ, పీజీ స్టూడెంట్స్ ఎస్.మంగరాజు, జయప్రద, జీవీ సత్యనారాయణ, వెంకటరత్నం, కొండలరావులు ముందుకు వచ్చారు. ప్రతిరోజు పిల్లలకు తమ విలువైన సమయాన్ని కేటాయించి, ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ తమ అనుభవాలను రంగరించి వివిధ అంశాలలో శిక్షణ ఇస్తున్నారు.

స్పోకెన్ ఇంగ్లీషు నేర్పుతున్నారు




ఏపీ ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెట్టింది. ఇంగ్లీషులో బేసిక్స్ నేర్పేందుకు కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా ఈ శిక్షణ కాలాన్ని విద్యార్థులకు కేటాయిస్తున్నాను. పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీషు నేర్పడం ఎంతో సంతోషంగా ఉంది. – ఎస్.సాల్మన్‌రాజు, విశ్రాంత ఎంఆర్ఓ

ఆసక్తిగా నేర్చుకుటున్నాం



శిక్షణ శిబిరంలో కథలు, కవితలు, పద్యాలు, సులువుగా లెక్కలు, పజిల్స్ ఇతర అంశాలు నేర్పిస్తున్నారు. హైదరాబాద్‌లో చదువుతున్నాను. వేసవిలో ఆట పాటల కంటే గ్రంథాలయం ఇస్తున్న శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నాం.
– విద్యార్థినీ బి.వీనీషా, 5వ తరగతి, హైదరాబాద్

యోగా నేర్పించారు



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలో ఎన్నో అంశాలు నేర్పిస్తున్నారు. చదువు, ఆట పాటలతో పాటు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఇంట్లో, పాఠశాలలో ఎలా ఉండాలో, పెద్దలను, గురువులను ఎలా గౌరవించాలో తదితర అంశాలను అవగాహన చేశారు. – బి.చిన్న రాము, 9వ తరగతి, శశి స్కూల్

కొత్త విషయాలపై శిక్షణ

శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా కొత్త విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయంలో ఏఏ పుస్తకాలు ఉంటాయి, పుస్తకాలు ఎలా చదవాలి, విజ్ఞానాన్ని ఎలా పెంపొందించుకోవాలో చెబుతున్నారు. అన్ని అంశాలు ఆసక్తికరంగా ఉన్నాయి.
– విద్యార్థినీ జి.జయశ్రీ, 7వ తరగతి, జెడ్పీ ఉన్నత పాఠశాల

చదువు, ఆట పాటలు ఉండాలి

గ్రంథాలయంలో చక్కని చదువులతో పాటు ఆట పాటలు నేర్పుతున్నారు. అనేక మంచి విషయాలను బోధిస్తున్నారు. గ్రంథాలయంలో ఏ విధంగా ఉండాలి, ఎలా ఉపయోగించుకోవాలో చెబుతున్నారు. గురువులకు కృతజ్ఞతలు చెబుతున్నాను.
– షేక్ సుబానీ, 8 వ తరగతి, సుబ్బారావుపేట స్కూల్

నూతన అంశాలపై అవగాహన

అన్నిరకాల పుస్తకాలు, పేపర్లతో ప్రశాంతమైన వాతావరణం ఉంది. వేసవిశిక్షణలోభాగంగా విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులోఉంచి శిక్షణ ఇప్పిస్తున్నాం. సహకరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పీజీ స్టూడెంట్స్‌కు గ్రంథాలయం తరుపున కృతజ్ఞతలు చెబుతున్నాం.
– గ్రేడ్ -1 గ్రంథాలయాధికారి, వానపల్లి శ్రీనివాసరావు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వెంకటరాయపురం బ్రాంచ్, తణుకు మండలం, ప.గో.జిల్లా.
పిన్-534215. ఫోన్: 08819-227022. E-Mail: ubin0903545@unionbankofindia.bank

డిమాండ్ నోటీసు 13(2)

దిగువ వారికి,
ఋణగ్రహీతలు : (ఎ) శ్రీ తమ్మినేని రాజశేఖర్ (పరభూస్తువారు), భర్త : బి. సత్తిరాజు, డి.నెం.35-25-14, గండం వారి వీధి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా-534211.
(బి) శ్రీమతి సానపాల రాజీ (సహ-పరభూస్తువారు), భర్త : ఎస్. సత్యనారాయణ, డి.నెం.35-25-14, గండం వారి వీధి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా-534211.
అయ్యా,
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, సెక్షన్ 13 (2) క్రింద **నోటీసు తేది 02.05.2023** న అధీకృత అధికారి, **వెంకటరాయపురం బ్రాంచ్** [illegible]

01-05-2023 న [illegible] (ఎన్‌పిఏ) వర్గీకరించబడింది.

[illegible]

01.05.2023 నాటికి బకాయి యూనియన్ [illegible] తేది.01.05.2023 నాటికి రూ.22,99,895.33 పై॥ (అక్షరాల ఇరవై రెండు లక్షల తొంభై తొమ్మిది వేల ఎనిమిది వందల తొంభై ఐదు రూపాయల ముప్ఫై మూడు పైసలు మాత్రమే).

సెక్యూర్డు ఆస్తి వివరములు : పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మున్సిపాలిటీ & [illegible]

తేది : 21.05.2023
ప్రదేశం : వెంకటరాయపురం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా